నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, శుక్రవారం 29 నవంబర్ 2024 VIKARABAD

# ‘ఓటీఎస్’ అంతంతే..!

## వచ్చింది.. రూ. 90 కోట్లే.. గడువు రెండ్రోజులే..

సిటీబ్యూరో: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న నీటి బిల్లుల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం ప్రకటించిన వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం తుది గడువు సమీపిస్తున్నది. మరో రెండు రోజుల్లో ( ఈ నెల 30వ తేదీ) గడువు పూర్తవుతుంది. వినియోగదారులు పెండింగ్‌లో ఉన్న అసలు మొత్తం కడితే ఎలాంటి వడ్డీ, ఆలస్య రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, ఈ రెండు రోజులు ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కాగా, జలమండలి పరిధిలో 7,11030 మంది బకాయిదారులకు ఓటీఎస్ సద్వినియోగం చేసుకోవాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం లక్ష మంది మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. రూ. 1792 కోట్లు ఓటీఎస్ రూపంలో రావాల్సి ఉండగా, కేవలం రూ. 90 కోట్లు మాత్రమే వచ్చింది. ఓటీఎస్‌ను సకాలంలో ప్రజల్లోకి తీసుకెళ్లకపోవడం, విధివిధానాల అమల్లో ఆలస్యం, అవగాహన లేమి తదితర కారణాలతో ఓటీఎస్‌కు ఆదరణ కరువైందని చెబుతున్నారు.

# ఎట్టకేలకు బల్దియా బడ్జెట్ రెడీ!

### రూ. 8600 కోట్లతో ప్రతిపాదన
### రేపు స్టాండింగ్ కమిటీలో చర్చ

సిటీబ్యూరో, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనతో జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. హౌసింగ్‌తో కలుపుకొని ఈ సారి రూ. 8,600 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 30న ఈ బడ్జెట్ ప్రతిపాదనపై మేయర్ అధ్యక్షతన జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు చర్చించి ఆమోదించే అవకాశాలున్నాయి. ఆ తర్వాత సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయనున్నారు. కాగా, 2024-25 బడ్జెట్ రూ. 7,937 కోట్లు కాగా, ఈ సారి దాదాపు రూ. 570 కోట్ల మేర అదనంగా బడ్జెట్ పెంచారు.

**డిసెంబర్ 15లోపు..:** వాస్తవానికి అక్టోబర్‌లోనే బడ్జెట్‌కు సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టాల్సి ఉన్నా నవంబర్ నెలాఖరు వరకు సమయం తీసుకున్నారు. డిసెంబర్ 15వ తేదీలోపు వార్షిక బడ్జెట్ అంచనాలు స్టాండింగ్ కమిటీ ఆమోదించాలని బల్దియా చట్టం పేర్కొంటున్నది. వచ్చే ఏడాది జనవరి 10వ తేదీలోపు జనరల్ బాడి మీటింగ్‌లో సభ్యుల ముందు చర్చ పెట్టి ఆమోద ముద్ర పొందాల్సి ఉంటుంది. మార్పులు, చేర్పుల ఆనంతరం ఫిబ్రవరి 20లోపు అంచనాలను మంజూరు చేయాల్సి ఉంటుందని చట్టం చెబుతున్నది. మార్చి 1లోపు కార్పొరేషన్ బడ్జెట్ అంచనాల సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. నిర్ణీత సమయంలో బడ్జెట్ ప్రక్రియను ముగిస్తారా? లేదంటే మార్పులు, చేర్పులతో ప్రభుత్వానికి సకాలంలో పంపించక కాలయాపన చేస్తారా? అన్నది వేచి చూడాలి.



పంజాగుట్ట ట్రాఫిక్ ఠాణా ఎదుట ఫుట్‌పాత్‌పై ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

# రోప్ ఇక్కడికి రాదా.?

### ఫుట్‌పాత్‌లను ఆక్రమించేస్తున్న పోలీసులు

సిటీబ్యూరో, నవంబర్ 28(నమస్తే తెలంగాణ): ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్‌లు, క్యారేజ్ వేలను ఆక్రమిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించడమే కాకుండా..పాదచారులు ఫుట్‌పాత్‌పై నడిచేందుకు వీలు లేకుండా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆపరేషన్ రోప్ (రిమూవల్ ఆఫ్ ఆబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎంక్రోచ్‌మెంట్స్)ను ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రారంభించారు. బయట ఫుట్‌పాత్‌లను క్లీన్ చేయడానికి ముందే, తమ ఠాణాల ముందు ఫుట్‌పాత్‌లు సరిగ్గా ఉన్నాయా? ఆ ఫుట్‌పాత్‌లపై ప్రజలు నడిచేందుకు అవకాశముందా? ఠాణాలకు వచ్చే వారు వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేస్తున్నారు? పార్కింగ్ సౌకర్యం ఉందా? అనే విషయాలు కూడా ఆలోచించాల్సిన అవసరముంది. అయితే, నగరంలోని ప్రధాన దారుల వెంబడి ఉన్న ఠాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేసే సౌకర్యం చాలా వాటికి లేదు. దీంతో చాలా ఠాణాల ముందు వాహనాలను రోడ్డుపై ఫుట్‌పాత్‌పైనే పార్కింగ్ చేస్తుంటారు. ఇటూ శాంతిభద్రతలు, అటూ ట్రాఫిక్ ఠాణాల ముందు ఈ పరిస్థితి ఉంది. చాలా ఠాణాల్లో వెనుక కొంతస్థలం పార్కింగ్ కోసం ఉన్నా, చాలామంది బయటే వాహనాలను పార్కు చేస్తుంటారు. మరికొన్ని చోట్ల ఠాణా సిబ్బంది తమ వాహనాలను లోపల ఉన్న పార్కింగ్ ప్లేస్‌లో పార్కు చేసుకుంటే, ఠాణాకు వచ్చిన వారితో ఠాణా ముందు రోడ్డు వాహనాలతో నిండి ఉంటుంది. ఇలా రద్దీలేని ప్రాంతాలే కాకుండా నిత్యం రద్దీగా ఉంటే రోడ్లపై ఉన్న ఠాణాల వద్ద పరిస్థితి ఇది.

### నడిచే స్థలమే ఉండదు...!

పంజాగుట్ట చౌరస్తాలో ఉన్న ట్రాఫిక్ ఠాణా ముందు ఒక వైపు పూర్తిగా ఫుట్‌పాత్‌ను పోలీసులు ఆక్రమించేశారు. రాంగ్ పార్కింగ్‌లలో వాహనాలు నిలిపితే ఆయా వాహనాలను క్రేన్ సహాయంతో తెచ్చి ఇక్కడే పార్కు చేస్తుంటారు. ఈ చౌరస్తాలో ఫుట్‌పాత్ పూర్తిగా ఆక్రమించేశారు. ఇదే ట్రాఫిక్ పోలీసులు ఈ విషయాన్ని గమనించడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. మధురానగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మారేడ్‌పల్లి, లంగర్‌హౌస్, హుమాయూన్‌నగర్, హబీబ్‌నగర్, ఆసిఫ్‌నగర్ ఇలా పలు లా అండ్ ఆర్డర్ ఠాణాల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. రద్దీగా ఉండే చాదర్‌ఘాట్ చౌరస్తాలో ఠాణా ముందు జాగలేదు. పక్కనే వాహనాలను పార్కు చేస్తారు. ఇక్కడకు వచ్చిపోయే వారు, తరచూ పోలీసులు రోడ్డు పక్కన వాహనాలను పార్కు చేస్తుండటంతో అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. ఇలా నగరంలోని పలు ఠాణాల వద్ద పార్కింగ్ స్థలాలు సరిగ్గా లేకపోవడంతో వాహనాలన్ని ఫుట్‌పాత్‌లు, రోడ్లపైనే పెడుతున్నారు. హైదరాబాద్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయం, ప్రస్తుత సీసీఎస్ భవనం వద్ద కూడా సరైన పార్కింగ్ సౌకర్యం లేదు. ఇక్కడ వాహనాలన్నీ నిజాం కాలేజీ గోడకు పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌లపై పార్కింగ్ చేస్తుంటాయి. చౌరస్తాలో ఉన్న ఆలయం ముందు ఉన్న ప్లేస్ అంతా పార్కింగ్‌కే ఉపయోగిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వచ్చే వాహనాలతో బీఆర్‌కేభవన్ వైపున్న రోడ్డంతా జామై ఉంటుంది. వీటికి తోడు బడా హోటళ్లు, బార్లు, మద్యం షాపుల ఎదుట రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతంలో ఉన్న పబ్‌ల వద్ద పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళల్లో వాహనాలన్నీ రోడ్లపై బారులు తీరి ఉంటాయి.

### ఏమి చేస్తారు...!

నగరంలో ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు చేపట్టిన రోప్ మంచి కార్యక్రమమే. ఫుట్‌పాత్ వ్యాపారాలు చేయడం ఒక మాఫియా మారింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో చాలా చోట్ల ఫుట్‌పాత్‌లు నిండిపోయాయి. కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌లను స్థానికంగా ఉండే నాయకులు కబ్జా చేస్తూ దానిని చిరు వ్యాపారులకు కిరాయికి ఇస్తూ నెల వారి కిరాయి వసూలు చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలలో ఫుట్‌పాత్ ఆక్రమణలు ప్రధానమైందే. కానీ, పోలీస్ ఠాణాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏ మేర పార్కింగ్ సౌకర్యాలున్నాయి? అక్కడకు వచ్చేవారు ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్నారా? అనే విషయాలపై పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరముంది. ఆపరేషన్ రోప్ అంటూ హడావుడి చేస్తూ స్థానిక పోలీసులు అక్కడక్కడ అధికారుల మెప్పు పొందేందుకు తాపత్రయ పడుతుంటారు. పూర్తిస్థాయిలో ఆయా ఠాణాల పరిధిలో రోప్‌ను అమలు చేస్తే ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు అవకాశం ఉంటుందని నగరవాసులు సూచిస్తున్నారు.

## ఆక్రమణల తొలగింపు

బేగంపేట్ : సికింద్రాబాద్ బేగంపేట్ ట్రాఫిక్ ఠాణా పరిధిలో ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణలను గురువారం తొలగించారు. బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య ఆధ్వర్యంలో ఫుట్‌పాత్ ఆక్రమణలు నిర్వహించారు. బేగంపేట్ కిమ్స్, ఆసుపత్రి రోడ్డులో ఇరువైపులా ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలైన బడ్డీ కొట్లు, ఛాయ్‌బండి, టిఫిన్ బండ్లు ఇతర చిరు వ్యాపారాలను పూర్తిగా తొలగించారు.

అలాగే, పార్కులైన్ సెంటర్ నుంచి ప్యారడైజ్ వరకు ఆక్రమణలను తొలగించారు. ఈ తొలగింపు కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజు, బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు. రోడ్డును, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ ఆటంకాలు కలిగిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.


కిమ్స్ ఆసుపత్రి రోడ్డులో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన బండ్లను తొలగిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య

## . నేడు దీక్షాదివస్

- ఘనంగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి
- రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌లో.. వికారాబాద్ జిల్లాలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల్లో ప్రోగ్రామ్‌లు



# దీక్షకు సిద్ధం

### వేలాదిగా తరలి రానున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

రంగారెడ్డి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ వచ్చుడో అన్న నినాదంతో తెలంగాణ ఉద్యమ రథసారథి.. బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆమరణ దీక్షకు పూనుకున్న రోజు నవంబర్ 29ని పురస్కరించుకుని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు ఉమ్మడి జిల్లాలో దీక్షాదివస్ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని హుడా కాలనీలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో జరుగనున్న ఈ ప్రోగ్రామ్‌కు ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి సెగ్మెంట్లకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు అధికంగా తరలి రానున్నారు. సుమారు నాలుగు వేల మంది ప్రతినిధులు హాజరయ్యేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి అడుగులు పడిన నవంబర్ 29 సందర్భంగా ..శుక్రవారం ఉదయం ముందుగా పార్టీ జెండావిష్కరణతో కార్యక్రమం ప్రారంభమై.. ఉద్యమ పూర్వాపరాలు, ఉద్యమ చరిత్ర, వీరుల త్యాగాలు వంటివి ఉండనున్నాయి. కార్యక్రమానికి మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితాఇంద్రారెడ్డి హాజరు కానున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరుగనున్న ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలు హాజరు కానున్నారు.

### ఏర్పాట్లు పూర్తి..

వికారాబాద్ : వికారాబాద్ జిల్లాలో దీక్షాదివస్‌ను సక్సెస్ చేసేందుకు దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి ..సెగ్మెంట్‌కు 500-600 మంది చొప్పున నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వికారాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయానికి తరలిరావాలని ఇప్పటికే పిలుపునిచ్చారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రతి ఏటా నవంబర్ 29న దీక్షాదివస్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు వివరించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తామని వివరించారు. అదేవిధంగా ఉద్యమ నేత కేసీఆర్ ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి డాక్యుమెంటరీ ప్రదర్శన ఉంటుందన్నారు.


వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం

### సక్సెస్ చేయాలి..



శంషాబాద్‌లో జరుగనున్న దీక్షా దివస్‌ను సక్సెస్ చేయాలి. ఇందు కోసం జిల్లా నలుమూలల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు, నాయకులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా వేలాదిగా తరలి రావాలి. ఈ ప్రోగ్రామ్ ద్వారా తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్ త్యాగాలను స్మరించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. నవంబర్ 29తో దీక్షా దివస్‌కు పదిహేనేండ్లు పూర్తవుతున్నాయి.

**-మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే**

### సెగ్మెంట్‌కు 500-600 మంది చొప్పున తరలివచ్చేలా ఏర్పాటు..



పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో దీక్షాదివస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నాం. ముందుగా జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి.. ఉదయం 9 గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తాం. నియోజకవర్గానికి 500-600 మంది చొప్పున నాలుగు సెగ్మెంట్లకు కలిపి రెండు వేల మంది నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తరలివచ్చి కార్యక్రమాన్ని సక్సెస్ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి సైతం హాజరు కానున్నారు.

**-డాక్టర్ మెతుకు ఆనంద్, బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే**

**జిల్లాకు మణిహారంగా మారనున్నదని భావించిన మొబిలిటీ వ్యాలీకి రాజకీయ గ్రహణం పట్టింది. భూసేకరణ పూర్తై ఏడాదిన్నర కావొస్తున్నా దానికి సంబంధించిన పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. వెనుకబడిన వికారాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం జిల్లాలో మొబిలిటీ వ్యాలీని 940 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకు అవసరమైన భూమిని కూడా సేకరించింది. అయితే అసెంబ్లీ ఎన్నికలు రావడం.. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటినా ఇప్పటివరకు మొబిలిటీ వ్యాలీకి సంబంధించి ప్రస్తావించకపోవడం గమనార్హం.**

**-వికారాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ)**


గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు కోసం ఎంపిక చేసిన స్థలం

# మొబిలిటీ వ్యాలీపై నీలినీడలు..

### భూసేకరణ పూర్తై ఏడాదిన్నర..

- పారిశ్రామికాభివృద్ధిపై పట్టని రేవంత్ సర్కారు
- 11 నెలలు దాటినా అడుగు ముందుకు పడని పనులు
- వికారాబాద్ జిల్లా అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం 940 ఎకరాల్లో మొబిలిటీ వ్యాలీ ఏర్పాటుకు నిర్ణయం
- భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లింపూ పూర్తి
- 636 అసైన్డ్ భూములిచ్చిన 400 మంది రైతులకు.. వారి బ్యాంకు ఖాతాల్లో ఎకరానికి రూ.17 లక్షల చొప్పన పరిహారం జమ

గత కేసీఆర్ ప్రభుత్వం వికారాబాద్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. అందుకోసం జిల్లాలో రూ. 50,000 కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేసేందుకు భూమిని కూడా సేకరించింది. దానిని అభివృద్ధి చేసే క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. తదనంతరం డిసెంబర్ మొదటి వారంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు మొబిలిటీ వ్యాలీ అంశాన్ని చర్చించకపోవడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. మొబిలిటీ వ్యాలీలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చిన పలు కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం ఉంటుందా.. ? ఉండదా..? అనే ఆందోళన జిల్లా ప్రజల్లో మొదలైంది. అంతేకాకుండా గత ప్రభుత్వం జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన స్థలంలోనే ఉంటుందా..? లేదా మరో చోటుకు వెళ్తుందా..? అనే అనుమానాలు జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం పారిశ్రామిక రంగంలో టీఎస్ఐఐసీ, టీఎస్-ఐపాస్ వంటి నూతన శకానికి నాంది పలికి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించింది.

### 4 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా..

మోమిన్‌పేట మండలంలోని ఎన్కతలలో రూ.50,000 కోట్ల పెట్టుబడులతో 4 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా గత కేసీఆర్ ప్రభు త్వం 940 ఎకరాల్లో మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఎలక్ట్రిక్ వాహనాలు, విడి భాగాలను తయారు చేసే పరిశ్రమలను మొబిలిటీ వ్యాలీలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన భూమిని రెండేండ్ల కిందటే సేకరించగా.. టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు కూడా కొంతమేర పూర్తయ్యాయి. కాగా భూములు స్వచ్ఛందంగా ఇచ్చిన రైతులకు గత ప్రభుత్వం నష్టపరిహారా న్ని కూడా చెల్లించింది. ఎన్కతల గ్రామ పంచాయతీ సర్వేనంబర్ 174, 198 పరిధిలోని 636.11 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించిన 400 మంది రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ఎకరానికి రూ.17 లక్షల చొప్పున పరిహారాన్ని జమ చేసింది. అదేవిధంగా అసైన్డ్‌దారుల కుటుంబాల్లోని అర్హులకు మొబిలిటీ వ్యాలీలో ఉద్యోగాలు కల్పించాలని, వారి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందు కు ప్రత్యేకంగా బాలురు, బాలికల రెసిడెన్షియల్ బడులనూ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అయితే రేవంత్ ప్రభుత్వం అసైన్డ్‌దారులకు ఉద్యోగాలు, వారి పిల్లలకు రెసిడెన్షియల్ బడులు తదితర సౌకర్యాలు కల్పించడంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఆందోళన భూములిచ్చిన కుటుంబాల్లో నెలకొన్నది. మరోవైపు మొబిలిటీ వ్యాలీతో స్థానికులకు ఉద్యోగావకాశాలు వస్తాయనే ఆశతో స్థానికులున్నారు. మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు కానున్న ప్రాంతంలో భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఎకరం ధర రూ. కోట్లకు చేరింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ ప్రాజెక్టు ఏర్పాటుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో భూముల ధరలు పడిపోవడంతోపాటు చుట్టుపక్కల పూర్తిగా క్రయవిక్రయాలు ఆగిపోయాయి.

